సాక్షి వరంగల్

శనివారం । 31 । ఆగస్టు । 2024



డిజిటల్ దిశగా ఎన్పీడీసీఎల్

టీజీ ఎన్పీడీసీఎల్ డిజిటల్ పద్ధతులతో వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రాధాన్యతనిస్తోంది.

- 8లో ▸



సమైక్యతకు ప్రతీక కాజీపేట దర్గా

కాజీపేట హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గా సమైక్యతకు ప్రతిరూపంగా నిలుస్తోంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
26^0 /24^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ కావ్య



వరంగల్: కలెక్టర్ డాక్టర్ సత్య శారదను ఎంపీ కడియం కావ్య శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీని కలెక్టర్ సాదరంగా ఆహ్వానించారు. జిల్లాలోని పలు అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్, ఆర్కియాలజీ సర్వే తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది.

హోటళ్లలో శుభ్రత పాటించాలి



గీసుకొండ: హోటళ్ల నిర్వాహకులు నాణ్యత, శుభ్రత పాటించాలని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ చేపూరి కృష్ణమూర్తి అన్నారు. తహసీల్దార్ రియాజుద్దీన్‌తో కలిసి శుక్రవారం గీసుకొండలో హోటళ్లను ఆకస్మిక తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్సులు లేకుండా హోటళ్లను నడుపుతున్న వారికి నోటీసులు జారీ చేశారు. వారం లోపు లైసెన్స్‌లు తీసుకోవాలని ఆదేశించారు. కొందరు నాసిరకం టీపొడి వాడితే కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని, అలాంటి వాటిని వాడొద్దని ఆదేశించారు. వరంగల్ నగరం నుంచి కొందరు తెచ్చి టీ పొడి తక్కువ ధరకు ఇస్తుండగా కొనుగోలు చేస్తున్నామని హోటల్ నిర్వాహకులు బదులు చెప్పారు. నాణ్యతలేని పొడిని పారబోసి బ్రాండెడ్ పొడినే వాడాలని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సూచించారు. అనంతరం వంచనగిరిలోని ఆదర్శ పాఠశాల, కేజీబీవీ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

గురుపూజోత్సవాన్ని విజయవంతం చేయాలి

వరంగల్: గురుపూజోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.జ్ఞానేశ్వర్ అన్నారు. గురుపూజోత్సవ నిర్వహణ, ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానంపై హనుమకొండ సుబేదారిలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వివిధ కమిటీల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుపూజోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 5న వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలోని ఆకుతోట ఫంక్షన్‌హాల్‌లో గురుపూజోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు. వీఐపీలను ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానించాలని, కమిటీలు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో జిల్లా సెక్టోరల్ అధికారులు సుజన్‌తేజ, ఫ్లోరెన్స్, కుడికాల సుభాష్, డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి, డీఎస్‌ఓ శ్రీనివాస్, ఏసీజీఈ నర్సింహారావు, ఎంఈఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

గీసుకొండ: ధర్మారం, పోతరాజుపల్లిలోని రేణుకాఎల్లమ్మ దేవాలయాల్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. హుండీలను పగులగొట్టి వాటిలోని నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ధర్మారంలోని ఆలయ తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారని ఆలయ కమిటీ సభ్యులు కొట్టె ముత్తిలింగం, కూసం శంకరయ్య, నాసం బాలరాజు శుక్రవారం గీసుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు.అలాగే, పోతరాజుపల్లి ఆలయ నిర్వాహకుడు బూర్గుల రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

వర్ధన్నపేట: భార్య కాపురానికి రాలేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. ఇల్లందకు చెందిన వేల్పుల భరత్ (28) అదే గ్రామానికి చెందిన మైదం పూజితను 2023లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని గ్రామానికి చేరుకున్నారు. తిరిగి హైదరాబాద్‌కు వెళ్దామని భరత్ కోరగా పూజిత రానని చెప్పింది. మనస్తాపానికి గురైన భరత్ ఈనెల 25న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంచనాల పెంపులో.. స్పెషాలిటీ ఏంటి?

'సూపర్' ఆస్పత్రి నిర్మాణ వ్యయం రూ.625.95 కోట్లు పెంపు

- జూన్ 29న నగర పర్యటనలోనే సీరియస్ అయిన సీఎం రేవంత్‌రెడ్డి
- సమీక్షలో అధికారుల వివరణకు అసంతృప్తి.. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశం
- శుక్రవారం క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన.. రికార్డుల తనిఖీ



నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్ సెంట్రల్ జైలు స్థానంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వ్యవహారం చినికిచినికి గాలివానగా మారుతోంది. గత ప్రభుత్వం రూ.625.95 కోట్ల మేరకు నిర్మాణ వ్యయం అంచనాలను పెంచడం ఇప్పుడు వివాదాస్పదమవుతోంది. జూన్ 29న వరంగల్‌కు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 12 ప్రధానాంశాలపై మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో సుదీర్ఘంగా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా 2021లో రూ.1,100 కోట్లతో మొదలుపెట్టిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అంచనా వ్యయాన్ని ఎటువంటి అనుమతులు లేకుండా అమాంతంగా రూ.1,725.95 కోట్లకు పెంచడాన్ని సీఎం తప్పుబట్టారు. ఇందుకు రహదారులు, భవనాల శాఖ అధికారులు చెప్పిన లెక్కలు, వివరాలకు సంతృప్తి చెందని ఆయన మంత్రులు ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో అదనంగా రూ.625.95 కోట్లు పెంచడంపై శుక్రవారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ సీవీ ఆనంద్ పర్యవేక్షణలో అధికారులు విచారణ జరపడం చర్చనీయాంశంగా మారింది. అధికారుల బృందం క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించింది. ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ కార్యాలయం నుంచి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణానికి సంబంధించిన అన్ని రికార్డులను తనిఖీ చేశారు.

రూ.1,100 కోట్ల నుంచి రూ.1725.95 కోట్లకు ఎలా..

వరంగల్‌లో 24 అంతస్తులతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం కోసం 2021 డిసెంబర్ 4న అప్పటి ప్రభుత్వం జీఓ 158 విడుదల చేసింది. హెల్త్ సిటీలో భాగంగా రూ.1,100 కోట్లు అవసరమవుతాయని ఆ జీఓలో పేర్కొంది. సివిల్ వర్క్స్, పారిశుద్ధ్యం, తాగునీరు, మెకానికల్, ఎలక్ట్రిసిటీ,



విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ బాలకోటి ఆధ్వర్యంలో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పనులు పరిశీలిస్తున్న అధికారులు

ప్లంబింగ్, ఆస్పత్రికి అవసరమైన పరికరాలు, ఇతర అన్ని పనులకు కలిపి ఇంత మొత్తం అవసరం అవుతాయని స్పష్టం చేసింది. ఆ వెంటనే అధికారులు టెండర్లు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఏడాది తర్వాత ఓసారి, ఆ తర్వాత మరోసారి అంచనా వ్యయాన్ని సవరిస్తూ పోయారు. రెండు విడతల్లో కలిపి ఏకంగా 56 శాతం అంచనా వ్యయాన్ని పెంచేశారు. రూ.1,100 కోట్ల వ్యయం కాస్త రూ.1,725.95 కోట్లకు పెంచారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను గత ప్రభుత్వం రహస్యంగా ఉంచగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ ఆస్పత్రుల నిర్మాణంపై జరిపిన సమీక్షలో ఈ వ్యవహారం బయటపడింది. అదనంగా రూ.625.95 కోట్లకు సంబంధించిన పనులపై సీఎం రేవంత్‌రెడ్డి జూన్ 29న వరంగల్ సమీక్షలో లేవనెత్తడంతో నీళ్లు మింగడం అధికారుల వంతైంది.

వీలైనంత త్వరగా విచారణ పూర్తి

వరంగల్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ వ్యయ అంచనాల పెంపుపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించాం. అన్ని కోణాల్లో విచారణ, పరిశీలన చేస్తున్నాం. వీలైనంత తొందరగా విచారణ పూర్తి చేసి నివేదికను డీజీకి పంపిస్తాం.

- బాలకోటి, వరంగల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, అడిషనల్ ఎస్పీ

అధికారులు చెబుతున్న లెక్కలు ఇవీ..

ఆస్పత్రి నిర్మాణం కోసం సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ (ఎంఈపీ) పనులకు మొదట రూ.884 కోట్లుగా అంచనా వేయగా తర్వాత రూ.1,066.54కు పెంచినట్లు సమీక్ష సందర్భంగా అధికారులు సీఎం రేవంత్‌రెడ్డికి ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు.

- రూ.107 కోట్లున్న మెడికల్ ఎక్విప్‌మెంట్‌కు రివైజ్డ్ ఎస్టిమేట్‌లో రూ.189.55 కోట్లకు పెంచారు.
- పన్నులు, చట్టబద్ధమైన అదనపు పనులకు పేర్కొన్న రూ.125 కోట్లను రూ.275.26 కోట్లు చేశారు. పార్కింగ్ ఏరియా, రెట్రో ఫిట్టింగ్, మాడిఫికేషన్స్, ఫ్యూచర్ ఎలివేషన్ పేరిట కొత్తగా రూ.176.22 కోట్లు, రహదారులు, భవనాల శాఖ పర్యవేక్షణ చార్జీల కింద రూ.18.38 కోట్లను పెరిగిన అంచనా బడ్జెట్‌లో చూపించారు.
- ఇవన్నీ కూడా సహేతుకంగా లేకపోవడంతోపాటు పెద్ద మొత్తంలో నిధుల దుర్వినియోగం జరిగిందన్న నిర్ణయానికి వచ్చిన ప్రభుత్వం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను రంగంలోకి దింపి విచారణ జరుపుతుండటం కలకలం రేపుతోంది.
- ఈ విషయాలపై వరంగల్ ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగేందర్‌రావుతో మాట్లాడేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

పంటలకు ప్రాణం



నర్సంపేటలో సాగుచేస్తున్న పత్తి పంట



నర్సంపేట పట్టణంలో కురుస్తున్న వర్షం

- జిల్లాలో కురిసిన వర్షం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

నర్సంపేట: జిల్లాలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షం పంటలకు ప్రాణం పోసింది. పది రోజులుగా వర్షాలు లేకపోవడంతో మక్కజొన్న, పత్తి, వరి పంటలు ఎండిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. సీజన్ ప్రారంభం నాటి నుంచి ఆశించిన వర్షాలు కురవలేదు. సాగు చేసిన పంటలు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. మోటార్ల ద్వారా నీరు అందించే ప్రయత్నం చేసినప్పటికీ పూర్తిస్థాయిలో సాధ్య పడలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆగస్టులో అంతంత మాత్రమే..

నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల నియోజకవర్గాల పరిధిలో ఆగస్టు నెలలో వర్షం అంతంత మాత్రంగానే కురిసింది. జిల్లా సగటు వర్షపాతం 1044.5 మిల్లీమీటర్లు ఉండగా లోటు వర్షపాతమే నమోదైంది. జిల్లాలో వరి పంట సాధారణ సాగు 1.45 లక్షల ఎకరాలు, పత్తి పంట 1.25 లక్షల ఎకరాలు, మక్కజొన్న 10 వేల ఎకరాల సాగు అంచనా ఉంది. సాధారణ స్థాయి కంటే తక్కువ విస్తీర్ణంలోనే పంటలు సాగవుతున్నాయి. పాకాల సరస్సు, మాదన్నపేట, కోపాకుల, రంగాయ చెరువులు మత్తడి పడినప్పటికీ భూగర్భ జలాలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఆయకట్టు కలిగిన మొత్తం చెరువులు 750 ఉన్నాయి. వంద ఎకరాలకు పైగా ఉన్నవి 450 చెరువులు, అంతకంటే తక్కువ ఎకరాలు ఆయకట్టు ఉన్న చెరువులు 300 ఉన్నాయి.



సమ్మక్క సాగర్ బ్యారేజీని పరిశీలిస్తున్న మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, ఎమ్మెల్యేలు, అధికారులు

- వివరాలు 8లో ▸

పరిశీలన.. సమీక్ష

- దేవాదుల వద్ద నాలుగు గంటలపాటు మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీతక్క పర్యటన
- ఎత్తిపోతల మోటార్లు.. గోదావరి వరద పరిశీలన అధికారులతో సమీక్ష.. దిశానిర్దేశం

- సాక్షిప్రతినిధి, వరంగల్/కన్నాయిగూడెం

కుటుంబ సభ్యుల వివరాలు అందజేయాలి

- రైతులకు కలెక్టర్ సత్య శారద సూచన
- మామునూరులోని ఐఓబీ సందర్శన



ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

మామునూరు: రుణమాఫీ కాని రైతులు ఏఓలను సంప్రదించి కుటుంబ సభ్యుల వివరాలు అందజేయాలని కలెక్టర్ సత్య శారద సూచించారు. ఖిలా వరంగల్ మండలం మామునూరులోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకును జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా కోపరేటివ్ అధికారి ఎం.సంగీత, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ హెచ్.రాజుతో కలిసి కలెక్టర్ సత్య శారద శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎంత మందికి రుణమాఫీ వర్తించింది, ఎంతమందికి రెన్యువల్ చేశారు, ఎంత మందికి రెన్యువల్ చేయాల్సి ఉంది, రూ.రెండు లక్షల కంటే ఎక్కువ రుణాలు ఉన్న రైతులు ఎంత మంది ఉన్నారు, ఆధార్ నంబర్ల వివరాలను బ్యాంకు మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. రైతుల వివరాలు తప్పుగా ఉంటే బ్యాంకు మేనేజర్ సరిచేస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం అక్కడ ఉన్న రైతులతో మాట్లాడారు. పంట రుణాలతో ఏం చేస్తున్నారని అడిగారు. ఎరువులు, పురుగు మందుల కొనుగోలుకు రుణాలు ఉపయోగిస్తున్నట్లు రైతులు కలెక్టర్‌కు వివరించారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నర్సింగం, ఏఓ రవీందర్‌రెడ్డి, బ్యాంకు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

హాస్టళ్లను శుభ్రంగా ఉంచాలి : కలెక్టర్

వరంగల్: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బీసీ, ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్లు, కేజీబీవీ, ట్రైబల్ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ప్రిన్సిపాళ్లు, రీజినల్ కోఆర్డినేటర్లతో శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు పరిశుభ్రంగా ఉంచాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు పోషకాహారం అందించాలని సూచించారు. బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలపై ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. హాస్టళ్లలో ఫిర్యాదుల బాక్స్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జోనల్ ఆర్సీఓ స్వరూపారాణి, ట్రైబల్ వెల్ఫేర్ (డీసీఓ) పి.అపర్ణ, డీఈఓ జ్ఞానేశ్వర్, డీబీసీడీఓ పుష్పలత, డీఎస్సీడీఓ భాగ్యలక్ష్మి, వర్ధన్నపేట సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాధిక, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ సౌజన్య పాల్గొన్నారు.

బీసీల గణన సత్వరమే చేపట్టాలి



కుమార్‌గాడ్గే దీక్షకు సంఘీభావం తెలిపిన నాయిని భరత్, ప్రజాసంఘాల నాయకులు


గీసుకొండ: రాష్ట్ర ప్రభుత్వం బీసీల గణన సత్వరమే చేపట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ ప్రజాసంఘం (టీబీసీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ గీసుకొండలో ఆమరణ దీక్ష చేస్తున్న రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గేకు శుక్రవారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఆమరణ దీక్ష చేస్తుండడంతో కుమార్ గాడ్గే ఆరోగ్యం క్షీణించిందని, ఆయనకు ఏమైనా అయితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. రాష్ట్ర మహిళా కన్వీనర్ చిత్తారి రజిత, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిపల్లి శ్రీలత, వరంగల్ నగర అధ్యక్షురాలు తోట సాగరిక, రాష్ట్ర యువజన నాయకులు బెజ్జాల కోటేశ్వర్, ఏబీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోట మహేందర్, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేశ్, డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేడల ప్రసాద్, పలు ప్రజాసంఘాల నాయకులు పూసల సాయిబాబా సంఘీభావం తెలిపారు. ఆమరణ దీక్ష చేస్తున్న కుమార్‌గాడ్గే ఆరోగ్యం క్షీణించిందని, అతడికి వైద్యులు పరీక్షలు చేశారని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు.

వార్డుల విభజన పూర్తిచేయాలి : జెడ్పీ సీఈఓ

సంగెం: గ్రామపంచాయతీల్లో వార్డుల విభజన త్వరగా చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ రాంరెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో వార్డుల విభజనను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల విభజనలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి, దోమలు లేకుండా చూడాలని సూచించారు. గ్రామాల్లో జ్వరాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీఓ కాసర్ల రవీందర్, ఎంపీఓ కొమురయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఇక.. చెరువులపై డ్రోన్ల చక్కర్లు

- వరంగల్, హనుమకొండ చెరువుల లైడర్ సర్వే
- ఎఫ్‌టీఎల్ గుర్తించి ఆక్రమణలపై ఉక్కుపాదం
- నగరాన్ని ముంపు నుంచి కాపాడేందుకు ప్రణాళిక
- 'హైడ్రా' తరహా వ్యవస్థ ఏర్పాటుకు అడుగులు



వరంగల్ నగరంలోని భద్రకాళి చెరువు

సాక్షి, వరంగల్: వరంగల్ నగరంలో చెరువులను లైట్ డిటెక్షన్ అండ్ రేజింగ్ (లైడర్) సర్వే చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలో 75 చెరువులు 213.11 కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయి. ఇందులో చాలా చెరువులు ఆక్రమణకు గురైన పరిస్థితిపై 'చెర'వు వీడాలంటే బుల్డోజర్లు దిగాల్సిందే..: శీర్షికన సాక్షిలో ఈ నెల 29న ప్రచురితమైన కథనానికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు సర్కారు ఆదేశాలతో ఇరిగేషన్ అండ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ (సీఏడీ) విభాగం అధికారులు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ) సహకారంతో లైడర్ సర్వేకు సిద్ధమయ్యారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని చెరువుల విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ఎంత, ప్రస్తుతం ఏ మేర ఉన్నాయి, ఎంతవరకు ఆక్రమణకు గురయ్యాయి అనే వివరాలు లైడర్ ద్వారా సేకరించిన సమాచారంతో పోల్చిచూస్తారు. అదేసమయంలో ఇప్పటికే రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు నిర్ణయించిన ఫుల్ ట్యాంక్ లెవల్‌తో కూడా సరిపోలుస్తారు. ఇలా అన్ని విధాలుగా అధ్యయనం చేసిన తర్వాత హైడ్రా తరహాలో ఇక్కడ కూడా ఓ వ్యవస్థను ఏర్పాటుచేసి అక్రమార్కుల భరతం పట్టేందుకు ముందుకెళ్తోంది. ఇందులో భాగంగానే తొలుత లైడర్ సర్వే ద్వారా పూర్తి సమాచారం సేకరించి ఆ తర్వాత కార్యాచరణ అమలు చేయనున్నట్లు తెలిసింది. ఎందుకంటే వర్షాలు ఎప్పుడొచ్చినా వరంగల్ వరద ముంపునకు గురవుతోంది. దీంతో చెరువుల కబ్జాలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

సర్వే చేయనున్న చెరువులు ఇవే..

వరంగల్ మండలంలోని చిన్న వడ్డేపల్లి, కోట చెరువు, ముసలమ్మ కుంట, సాయి చెరువు, ఈదుల చెరువు, రామసముద్రం, బ్రాహ్మణకుంట, తుర్కల కుంట, దుబ్బ కుంట, తుర్కల చెరువు, నల్లచెరువు, ఉగాది చెరువు, చాకలికుంట, పురిగిద్ద, తుమ్మల కుంట, మొగుళ్ల బంధం, ఈదుల కుంట, తిమ్మనగరి కుంటలో సర్వే చేయనున్నారు. ఖిలా వరంగల్ మండలంలోని లార్జ్ ట్యాంకు, దామెర చెరువు, గుడి కుంట, మద్దెల కుంట, భాగవాణి చెరువు, కుమ్మరి కుంట, తిప్పరోని కుంట, అప్పలవారికుంట,, జగన్నాయకుల కుంట, మల్లోని కుంట, నర్సింగరాజు కుంట, ఊర చెరువు, బెస్తం చెరువు, రంగ సముద్రం, ఊర చెరువు, వీరోజీ కుంట, బొంతులకుంట, ఎర్రకుంట, చింత కుంట, బర్రెంకుల కుంట, సకలోని కుంట, టెట్టె కుంట, ఈదుల కుంట, వీరాజి కుంట, బొమ్మకుంట, నిమ్మ కుంట, కొట్ట కుంట, పెద్ద కుంట, నక్కలపల్లి చెరువు, కింది కుంట, నిమ్మ కుంట, మద్దెల కుంట, బండ కుంట, కొంకవాయి కుంట, మంగళమ్మ కుంట, ఎర్ర కుంట, కంచెలపాని కుంట, పంతులవాణి కుంట, ఊర చెరువు, జిల్ల కుంట, పాదాల కుంటలో సర్వే చేయనున్నారు. హనుమకొండ మండలంలోని భద్రకాళి చెరువు, పద్మాక్షి గుండం, సిద్దేశ్వర గుండం, వడ్డేపల్లి చెరువు, సిద్ధసముద్రం, మొర్రి కుంట, బర్రెంకుల కుంట, మల కుంట, ఎనుకూల సూరంకుంట, పెద్ద చెరువు, కోడి కుంట, చిన్న చెరువు, ఉంగల చెరువులో లైడర్ సర్వే నిర్వహించి అధికారులు ఆక్రమణలు తొలగించనున్నారు.

లైజర్ సర్వే ఎలా చేస్తారంటే..

చెరువు విస్తీర్ణంతో పాటు అందులో ఉండే ప్రతి అంగుళాన్ని లైడర్ సర్వే ద్వారా గుర్తిస్తారు. డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ ద్వారా కచ్చితమైన చెరువు విస్తీర్ణంతో పాటు అక్కడి పాయింట్లు, కోఆర్డినేట్స్ క్యాప్చర్ చేస్తారు. అలాగే, చెరువుపై డ్రోన్లను ఉపయోగించి వీడియోలు తీసుకొని కొలతలు నమోదు చేస్తుంది. ఫొటోలు కూడా క్యాప్చర్ చేస్తుంది. లైవ్ ఇన్ఫర్మేషన్ శాటిలైట్ ఇమేజ్ ఫార్మాట్‌లోకి వచ్చేస్తుంది. దీన్ని ఆటోక్యాడ్, ఆర్క్ జీఎస్ ఫార్మాట్‌లోకి తీసుకొని గతంలో ఆ చెరువు ఉన్న పాత శాటిలైట్ చిత్రాలతో సరిపోల్చి ఎంత వరకు చెరువు ఆక్రమణకు గురైందనే వివరాలు తెలుసుకుంటారు. ఇప్పటికే నీటిపారుదల శాఖ, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు గుర్తించిన ఎఫ్‌టీఎల్ హద్దులతోనూ సరిపోల్చి కబ్జాలు జరిగాయా లేదా అని తెలుస్తారు. ఏమైనా అక్రమ కట్టడాలు వెలిస్తే హైడ్రా తరహాలో వరంగల్‌లోనూ ఓ సంస్థను ఏర్పాటుచేసి నీటి వనరులను సంరక్షించే దిశగా కార్యాచరణ సిద్ధం అవుతోందని తెలుస్తోంది.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

వరంగల్: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబం అభివృద్ధి మార్గంలో పయనిస్తుందని ఇండస్ట్రీస్ జీఎం వీఎస్.రాజు అన్నారు. వరంగల్ 19వ డివిజన్ సొసైటీ కాలనీలోని స్వశక్తిభవన్ (కమ్యూనిటీహాల్)లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నైపుణ్య శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మా జనని ఉమెన్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆరు వారాల బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసుకున్న మహిళలను అభినందించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న 31 మంది మహిళలకు సర్టిఫికెట్లు, స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటపోటీల విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షురాలు వడ్డేపల్లి మాధవి, డైరెక్టర్లు సౌమ్య, స్వప్న పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నర్సంపేట: నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చైర్మన్ పాలాయి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన పాలకవర్గ సాధారణ సమావేశంలో ఏకగ్రీవంతో పలు తీర్మానాలు చేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ విశ్రాంతి భవనంలో మరమ్మతులు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, మార్కెట్ యార్డు కాంపౌండ్ వాల్, గోదాంల మరమ్మతులు, కలరింగ్, నూతన ఫర్నిచర్ కొనుగోలు తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డులో వృథాగా ఉన్న ఇనుప సామగ్రిని విక్రయించడానికి టెండర్ జారీ చేస్తున్నట్లు తెలిపారు. నాబార్డు గోడౌన్‌కు ఇరువైపులా సీసీ రోడ్డు వంటి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. పనుల కోసం డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ తెలంగాణకు తీర్మానాలు పంపినట్లు తెలిపారు. అనంతరం మార్కెట్ పరిధిలోని గోదాంలను పాలకవర్గ బాధ్యులు సందర్శించారు.

మార్కెటింగ్ గోడౌన్ లో సీసీ ప్లాట్‌ఫాం

దుగ్గొండి: మండలంలోని వెంకటాపురం మార్కెటింగ్‌శాఖ గోడౌన్ ఆవరణలో సీసీ ప్లాట్‌ఫాం నిర్మిస్తామని నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ అన్నారు. గ్రామంలోని 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్ చుట్టూ సీసీ వేయకపోవడంతో బురదమయంగా మారి వాహనాలు కూరుకుపోతున్నాయి. మార్కెట్ డైరెక్టర్ హింగే రామారావు అభ్యర్థన మేరకు శుక్రవారం ఆయన అధికారులతో కలిసి ప్లాట్‌ఫాం మొత్తం సీసీ వేయడానికి పరిశీలించారు. మార్కెటింగ్‌శాఖ నిధులతో పూర్తిస్థాయిలో సీసీ వేయిస్తామన్నారు. మార్కెట్ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, మార్కెట్ డైరెక్టర్లు, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎస్సార్‌లో 'హ్యాకథాన్'



మాట్లాడుతున్న ఇంద్రజిత్ గుప్తా

హసన్‌పర్తి : ఎస్సార్ యూనివర్సిటీలో ఎస్ఐఎస్ ఇంటర్నల్ హ్యాకథాన్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇంద్రజిత్ గుప్తా, ప్రొఫెసర్ శశికళ మార్తల ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కొత్త ఆలోచనలతో సృజనాత్మకతను వెలికి తీయడంలో భాగంగా ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి బహుళజాతి కంపెనీలు సరైన ఉద్యోగావకాశాలు అందించేందు కు ఈ హ్యాకథాన్ దోహదపడుతోందన్నారు .తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఔట్ సోర్సింగ్'కు మంత్రుల సిఫార్సా?

వరంగల్ : ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఔట్ సోర్సింగ్ పోస్టులకు రాష్ట్ర మంత్రులు సిఫారసు చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అధికారులే నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు చేపడుతూ మంత్రుల పేర్లు చెబుతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. గతంలో మార్కెట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి విధులకు గైర్హాజర్ కావడంతో అతడి స్థానంలో అప్పటి మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి మరొకరికి పోస్టింగ్ ఇచ్చారు. ఈ పోస్టింగ్ విషయంలో ఆర్థిక లావాదేవీలు జరిగినట్లుగా ప్రచారం జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా ఎలా నియామకం చేశారని అడిగిన వారికి అప్పటి మినిస్టర్ సిఫారసుతోనే అని చెప్పడంతో ఎవరు పట్టించుకోలేదు. అదే తరహాలో ఇటీవల ఈశ్వర్ అనే కంప్యూటర్ ఆపరేటర్ విధులకు గైర్హాజర్ కావడంతో అతడి స్థానంలో మార్కెట్‌లో పనిచేస్తున్న ఉద్యోగి కొడుకును నియమించినట్లు తెలిసింది. ఈవిషయంపై కొందరు మార్కెట్ అధికారులను ప్రశ్నించగా మంత్రి ఆదేశాల మేరకు నియమించినట్లు సమాధానం ఇవ్వడంతో మిన్నకుండిపోయారు. అసలు ఈ పోస్టులకు మంత్రులు సిఫారసు చేస్తున్నారా..నిబంధనలను పట్టించుకోకుండా మార్కెట్ అధికారులే నియమించి వారి పేరు చెప్పి తప్పించుకుంటున్నారన్న విషయంపై విచారణ చేస్తే అసలు విషయాలు వెలుగుచూసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఔట్ సోర్సింగ్‌పై నియామకమైన అన్వేష్ పర్వతగిరి సబ్ యార్డులో విధులు నిర్వర్తిస్తున్నట్లు సమాచారం.

గంజాయి విక్రేతల అరెస్ట్



వాజేడు : గంజాయి విక్రయిస్తున ఇరువురిని అరెస్టు చేసినట్లు ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు. వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు రెండో ఎస్సై ఇమాన్యుయేల్‌తో కలిసి శుక్రవారం అరెస్టు వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్‌పురం మండలం, రామవరం గ్రామానికి చెందిన పొన్నాడ దుర్గ శివ, కుంజా నగేష్ రోడ్లపై వెళ్తున్న వారికి గంజాయి విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లగా పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి పట్టుకుని తనిఖీ చేయగా సుమారు 15 కేజీల గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. వెంకటాపురం(కె) సీఐ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్పీ శివం ఉపాధ్యాయ పేర్కొన్నారు.

డిజిటల్ దిశగా ఎన్పీడీసీఎల్

విస్తృతంగా సాంకేతిక సేవలు

- పనుల ఎస్టిమేట్, మంజూరు కూడా ఆన్‌లైన్‌లోనే
- తగ్గిన పేపర్ వినియోగం

హన్మకొండ : సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటు టీజీ ఎన్పీడీసీఎల్ ముందుకు సాగుతోంది. ప్రతి విభాగంలోనూ సాంకేతిక(డిజిటల్) పద్ధతులను అమలు చేస్తుండడంతో పేపర్ వినియోగం తగ్గింది. వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలకు అందించేందుకు ప్రాధాన్యతనిస్తోంది. ఈ క్రమంలో సిస్టమ్ యావరేజ్ ఇంటరప్షన్ డ్యురేషన్ ఇండెక్స్ (సైదీ), సిస్టమ్ యావరేజ్ ఇంటరప్షన్ ఫ్రీక్వెన్సీ ఇండెక్స్ (సైఫీ)ని అంతరాయాలకు కొలమానంగా తీర్చిదిద్దారు. సగటు వినియోగదారుడికి కలిగే అంతరాయాలకు సంబంధించి రియల్ టైమ్ డేటాను క్రోడీకరించి వాస్తవ గణాంకాల ఆధారంగా విశదీకరించి అంతరాయాలు లేకుండా సత్వర చర్యలు తీసుకుంటున్నారు. షెడ్యూల్ నిర్వహణ మొత్తం యాప్‌లో పొందుపరుస్తున్నారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్, సబ్ స్టేషన్ మెయింటెనెన్స్, పాత విద్యుత్ లైన్ల మరమ్మతులు, కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు, మీటర్ల బిగింపు, మార్పు వంటి ప్రతి పని ఎన్పీడీసీఎల్ ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తారు.

- వినియోగదారుల సేవలకు ఆలస్యం లేకుండా సకాలంలో పూర్తి కావడానికి ఈ–స్టోర్ విధానాన్ని ఎన్పీడీసీఎల్ ప్రవేశ పెట్టింది. దీని ద్వారా పేపర్ వినియోగం లేకుండానే మొత్తం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. సంబంధిత సెక్షన్ ఏఈలు అభివృద్ధి పనులు, నిర్వహణకు అవసరమైన మెటీరియల్‌ను ఈ–స్టోర్‌లోకి వెళ్లి ఆపరేషన్ ఏడీ లాగిన్‌లో నమోదు చేస్తారు. తర్వాత ఏడీ పరిశీలించి జిల్లా స్టోర్‌కు ఫార్వర్డ్ చేస్తారు. దీంతో క్షేత్ర సిబ్బంది సమయం ఆదా అవుతుంది.
- డిస్కంలకు సంబంధించిన ప్రతి సమాచారాన్ని చూసే డాష్‌బోర్డు అప్లికేషన్‌ను రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎక్కడ ఏం జరిగిన ఆ సమాచారాన్ని పూర్తి స్థాయిలో తెలుసుకునే సదుపాయం డాష్‌బోర్డు ద్వారా కలుగుతుంది. దీంతో పాటు చాట్‌బాట్, ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడానికి ఎన్పీడీసీఎల్ యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది.
- రీయాక్టివ్ పవర్ కాంపన్సేషన్ ద్వారా విద్యుత్ సరఫరాను గణనీయంగా మెరుగు పర్చడానికి కెపాసిటర్ బ్యాంకులు అమర్చుతున్నారు. వీటి ద్వారా సాంకేతిక నష్టాలు తగ్గడంతో పాటు, నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతోంది. వ్యవసాయ ఫీడర్లు, పారిశ్రామిక ఫీడర్లలో లోఓల్టేజీ లేకుండా విద్యుత్ మోటార్లు కాలిపోకుండా నివారించబడుతాయి.
- అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్‌లో భాగంగా 33 కేవీ, 11 కేవీ విద్యుత్ స్తంభాలను యూనిక్ పోల్ నంబర్ వేస్తున్నారు. ఏమైనా సమస్య ఉత్పన్నమైనప్పుడు ఈ నంబర్ ఆధారంగా గుర్తించే వీలుంటుంది. పోల్‌ల వారీగా పెట్రోలింగ్ సులభంగా చేపట్టే అవకాశముంటుంది. ప్రత్యేక యాప్ ద్వారా నిర్వహణను కూడా ట్రాక్ చేసే వీలుంటుంది.యూనిక్ పోల్ నంబర్ ద్వారా లొకేషన్ తెలుసుకుని వెంటనే అక్కడికి చేరుకుని సమస్యను త్వరితగతిన పరిష్కరించే వీలుంటుంది.



విద్యుత్ సబ్ స్టేషన్

వినియోగదారులకు సత్వర సేవలు



వినియోగదారులకు మరింత నాణ్యమైన, మెరుగైన సేవలు అందించడానికి సాంకేతికతను వినియోగించుకుంటున్నాం. టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి సంస్థలో సాంకేతిక పద్ధతులను విస్తృతంగా అమలు చేస్తున్నారు. ప్రతి పనిలో జవాబుదారితనం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. సంస్థకు సంబంధించిన **అన్ని సేవలు ఆన్‌లైన్**, ప్రత్యేక యాప్ ద్వారా సాగుతున్నాయి.

– కె.వెంకటరమణ, ఎస్ఈ, హనుమకొండ

తగ్గిన అంతరాయాలు



సాంకేతిక విధానాలతో విద్యుత్ అంతరాయాలు గణనీయంగా తగ్గాయి. పనుల్లో కాలయాపన లేకుండా వినియోగదారులకు సత్వర సేవలు అందుతున్నాయి. ప్రతి పనిని ఆన్‌లైన్, యాప్ ద్వారా సీఎండీ నుంచి ఏఈ వరకు ప్రతి అధికారి తెలుసుకునే అవకాశముంది. తద్వారా కిందిస్థాయి సిబ్బందికి ఎప్పటికప్పుడు **అవసరమైన సలహాలు** ఇవ్వడానికి వీలు కలుగుతోంది.

– మధుసూదన్ రావు, ఎస్ఈ, వరంగల్

'మహాలక్ష్మి'తో ఆర్టీసీకి ఆదాయం

- వరంగల్ ఆర్ఎం డి.విజయభాను



ప్రగతి రథచక్రం అవార్డులు అందుకున్న ఉద్యోగులతో అధికారులు

హన్మకొండ : మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి కళ వచ్చిందని వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను తెలిపారు. ఈమేరకు శుక్రవారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్–1 డిపోలో గత త్రైమాసికంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ఆర్ఎం ప్రగతి చక్రం, నగదు అవార్డులు, ప్రశంస పత్రాలు అందించి సన్మానించారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ సంస్థలోని ఉద్యోగులు కష్టపడి పని చేస్తున్నారన్నారు. రాఖీ సందర్భంగా సిబ్బందితోపాటు ఆయా కేటగిరీల ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి బస్సులు నడిపి ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానానికి చేర్చారని చెప్పారు. అత్యధిక ఆదాయం సాధించడంలో ముఖ్య భూమిక పోషించారని వారిని అభినందించినారు. శ్రావణమాసం చాలెంజ్‌లో వరంగల్ రీజియన్ అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. ఆర్టీసీకి ప్రయాణికులే ఆస్తి అని సిబ్బంది వారితో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. ప్రధానంగా మహాలక్ష్మి పథకం అమలుతో బస్సుల్లో మహిళ ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, వారితో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సిబ్బందికి సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు కేశరాజు భానుకిరణ్, ఎం.మాధవరావు, కరీంనగర్ జోన్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ బాపురావు, విజిలెన్స్ సీఐ రవీందర్, అకౌంట్స్ ఆఫీసర్ రవీందర్, వరంగల్–1 డిపో మేనేజర్ వంగల రవీందర్‌తో పాటు తొమ్మిది డిపోల మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కాసం ఫ్యాషన్స్ షాపింగ్ మాల్‌లో చోరీ

- రూ.3.40 లక్షలు అపహరణ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న టౌన్ సీఐ దేవేందర్

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని కాసం ఫ్యాషన్స్ షాపింగ్ మాల్‌లో రూ.3.40 లక్షల నగదు చోరీ చేశారు. మాల్ స్టోర్ మేనేజర్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే గురువారం రాత్రి కాసం ఫ్యాషన్స్ షాపింగ్ మాల్‌ను బంద్ చేసి వెళ్లిపోయామని, శుక్రవారం ఉదయం నిర్వాహకులు వచ్చి మాల్ ప్రధాన షెటర్ తీసి లోపలికి వెళ్లగానే దొంగలు పడినట్లు గుర్తించారు. దీంతో మాల్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై బి.విజయ్ కుమార్, సీసీఎస్, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం బృందాలను రప్పించి ఆధారాలు సేకరించారు. ఈ ఘటనలో రూ.3.40 లక్షల నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గడ్డపారతో ఇనుప చువ్వలు తొలగించి..

కాసం ఫ్యాషన్స్ షాపింగ్ మాల్‌లో చోరీ జరిగిన విషయంలో దొంగతనానికి పాల్పడిన దుండగులు షాపింగ్ మాల్‌ను అనుకుని ఉన్న ఇంటి వెనకాల నుంచి మాల్‌పై భాగానికి చేరుకున్నారు. అక్కడ మెట్ల నుంచి భవనం లోపలికి దిగే ఇనుప గేట్ చువ్వలను గడ్డపారతో తొలగించి మాల్ లోనికి ప్రవేశించారు. షాపులోని నగదు కౌంటర్‌ను (ఇనుప లాకర్ పెట్టె) గ్యాస్ కట్టర్‌తో రంధ్రం చేసి అందులో ఉన్న రూ.3.40 లక్షల నగదు దోచుకెళ్లారు. చోరీ ఆనవాళ్లను గుర్తుపట్టకుండా ఉండేందుకుగాను సీసీ కెమెరాను సైతం ధ్వంసం చేసి హార్డ్ డిస్క్ తమవెంట తీసుకువెళ్లారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి మృతి

అనుమానాస్పదంగా విద్యార్థిని



లిఖిత మృతదేహం

వరంగల్ క్రైం : వడ్డెపల్లి చెరువులో పడి విద్యార్థిని మృతి చెందినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. రాంపూర్‌లోని వీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని రామ లిఖిత (16) గురువారం ఉదయం కాలేజీకి వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దీంతో తెలిసిన వారిని సంప్రదించగా లిఖిత ఆచూకీ దొరకలేదని, శుక్రవారం వడ్డెపల్లి చెరువులో మృతదేహం లభించిందని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. మృతురాలి తల్లి చిత్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి..



రోహిత్ సాయి, మృతదేహం

సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫారెస్ట్ శాఖ కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాతాశ్వరపు రోహిత్ సాయి (17) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. మడికొండ అంబేడ్కర్ కాలనీకి చెందిన రోహిత్ సాయి హనుమకొండ బాలసముద్రంలోని ఎస్ఆర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గురువారం సాయంత్రం బస్సులో ఇంటికి తిరిగి వెళ్తుండగా ఫారెస్ట్ కార్యాలయం వద్ద డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తతో బస్సు నడపడం వల్ల రోహిత్‌సాయి బస్సులో నుంచి కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ మనోహర్ యాదవ్ పై కేసు నమోదు చేసి మృతుడి తల్లి సురేఖ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న కౌలురైతు..



రమేశ్ (ఫైల్)

దామెర : ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతున్న కౌలు రైతు మృతిచెందిన ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ల్యాదెళ్లలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన కథనం ప్రకారం..ల్యాదెళ్ల గ్రామానికి చెందిన పకిడె రమేశ్ (55) కొన్నేళ్లుగా ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆశించిన దిగుబడిరాక రూ.5లక్షల అప్పులు చేశాడు. కాగా ఈ ఏడాది కూడా పంటలు సరిగా దిగుబడి రాదని, చేసిన అప్పులు ఎలాతీర్చాలో తెలియక మానసికంగా ఆందోళనకు గురయ్యాడు. దీంతో ఈ నెల 27న సాయంత్రం పురుగుల మందు తాగాడు. 28న ఉదయం కడుపులో నొప్పిగా ఉందంటూ తాను పురుగుల మందు తాగిన విషయం కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతిచెందాడు. ఈ విషయమై శుక్రవారం రమేశ్ కుమారుడు పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు.

సమైక్యతకు ప్రతీక కాజీపేట దర్గా

ఆకుపచ్చ దర్గాగా ప్రపంచ గుర్తింపు

- సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ సమాధి
- నేటినుంచి సెప్టెంబర్ 3 వరకు ఉత్సవాలు
- దేశ, విదేశాల నుంచి భక్తులు రాక



విద్యుత్ కాంతుల్లో కాజీపేట దర్గా

కాజీపేట రూరల్ : కాజీపేట హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గా సమైక్యతకు, భారతీయ సంస్కృతికి మూలమైన భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతిరూపంగా నిలుస్తోంది. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం రెండో నెల సఫర్ ప్రకారం దర్గా ఉత్సవాలు ప్రారంభమవుతాయి. దేశంలోనే కాజీపేట దర్గా మూడోవది, ప్రపంచంలో 7వ దర్గాగా ప్రసిద్ధి. దేశ, విదేశాల నుంచి హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కు మతస్తులతో పాటు కులమత భేదం లేకుండా లక్షలాది భక్తులు నేటినుంచి సెప్టెంబర్ 1, 2, 3వ తేదీ వరకు జరిగే దర్గా ఉత్సవాల్లో పాల్గొంటారని దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా తెలిపారు. ఇస్లాం ప్రకారం మహా పురుషులకు చెందిన దర్గాలకు మాత్రమే ఆకుపచ్చ రంగు వేస్తారు. ప్రపంచంలో ఆకుపచ్చ రంగుతో మదీనా, బాగ్దాద్, తర్వాత కాజీపేట దర్గా మాత్రమే ఉందని మతపెద్దలు చెబుతారు.

హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్‌బియాబానీ మూల వంశీయులు ఇరాక్‌కు చెందిన పూర్వీకులు.ముల్తాన్‌కు చెందిన హజ్రత్ సయ్యద్ జియాఉద్దీన్ బియాబానీ రిఫాయి–అల్–ఖాదిరి (1423 ఏ.డీ) బియాబానీ వంశ మూల పురుషుడు. బియాబాని అంటే ఉర్దూలో ఎడారి లేదా అడవి అని అర్థం.

సందల్, ఉర్సు ఉత్సవం, బదావా ప్రత్యేకం

దర్గా ఉత్సవాల్లో భాగంగా నేడు (శనివారం) గుసూల్‌లో బియాబానీ సమాధిని రోజ్ వాటర్‌తో శుద్ధిచేస్తారు. 1వ తేదీన గంధం (సందల్) వేడుక ప్రత్యేక ఆకర్షణీయంగా నిలుస్తోంది. ఇరాక్ నుంచి తీసుకవచ్చిన గంధపు చెక్కల నుంచి ఖుస్రుపాషా కుటుంబీకులు బడేఘర్ వద్ద ప్రత్యేకంగా గంధంను తయారు చేస్తారు. రాత్రి 10 గంటల నుంచి అర్ధ రాత్రి 1గంట వరకు సందల్ ఉత్సవాల్లో ఖుస్రుపాషా పూర్వీకుల నుంచి ఆనవాయితీగా (సందల్ కాకటోరా) వెండి పాత్రలో గంధం లేపనంను, రోజ్ వాటర్‌ను మేళతాళాలు, గుర్రాలు, భక్తుల కోలాహలం మధ్య దర్గాకు ఊరేగింపుగా తీసుకు వస్తారు. రోజ్‌వాటర్‌తో బియాబానీ సమాధిని శుద్ధి చేసి గంధం లేపనంను పూసి, పూలమాలలు, పట్టు వస్త్రాలు సమర్పించి ఉత్సవాలు ప్రారంభిస్తారు. 2వ తేదీన దర్గా ఉత్సవాలు, ఖవ్వాలి జరుగుతాయి. 3వ తేదీన బదావాలో పకీర్ల విన్యాసాలు, ముగింపు ఉంటాయి. వివిధ ప్రాంతాల నుంచి పకీర్లు తమదైన శైలీలో విన్యాసాలు ప్రదర్శిస్తారు.

వంట పాత్ర ప్రత్యేకం

దర్గా ఉత్సవాల్లో ఈ సారి భక్తుల కోసం లంగర్ హౌజ్‌లో 11 వందల కిలోల వంట పాత్రలో 7,500 మంది భక్తులకు ఒకేసారి భోజనం చేసే వంటపాత్రను ప్రత్యేక స్థలంలో ఏర్పాటు చేశారు. ఇరాక్‌లో ఒకేసారి 1.70 లక్ష మందికి, ఇండియాలో అజ్మీర్ దర్గాలో ఒకేసారి 49,000ల మందికి అన్నం సిద్ధం చేసే సిస్టం ఉందన్నారు. కాజీపేట దర్గాలో ఈ సారి భక్తుల కోసం ప్రత్యేక మెటీరియల్‌తో వంట పాత్రను ఏర్పాటు చేశారు.

దర్గా ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి

ఉత్సవాల్లో భాగంగా దర్గాకు విద్యుత్ కాంతులతో అలంకరించారు. రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సౌకర్యం, శానిటేషన్, భక్తుల రాక, బస, వైద్య శిబిరం, దర్గా రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లు అన్ని సిద్ధం చేశారు. మూడు రోజుల దర్గా ఉత్సవాల్లో దేశ, విదేశాల నుంచి సుమారు 4 లక్షల మంది భక్తులు రానున్నారు.

– భక్తియార్ బియాబానీ, దర్గా పీఠాధిపతి

పరిశీలన.. సమీక్ష

నాలుగు గంటలపాటు సాగిన మంత్రుల దేవాదుల పర్యటన



సమీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి అనసూయ(సీతక్క), మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు

- హెలికాప్టర్‌లో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీతక్క
- ఎత్తిపోతల మోటార్లు.. గోదావరి వరద పరిశీలన
- అధికారులతో సమీక్ష.. దిశానిర్దేశం
- అడుగడుగునా పోలీసుల ఆంక్షలు..

సాక్షిప్రతినిధి, వరంగల్/కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామపంచాయతీ గుట్టగంగారంలోని దేవాదుల జె. చొక్కారావు ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్కలు పరిశీలించారు. పనుల పూర్తికి అధికారులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీప్రాంతం కావడంతో అడుగడుగునా పోలీసులు ఆంక్షలు విధించారు. మంత్రులు హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో తుపాకులగూడెం సమ్మక్క బ్యారేజీ వద్ద ఉన్న హెలిపాడ్‌కు శుక్రవారం ఉదయం 10.10 గంటలకు చేరుకున్నారు. అక్కడినుంచి వాహనాల ద్వారా గుట్టలగంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకానికి చేరుకున్నారు. నీటి పంపింగ్‌ను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మోటార్ల పనితీరును పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీసి పెండింగ్‌లో ఉన్న వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం గోదావరి ప్రవాహం వద్దకు చేరుకుని ఉధృతిని పరిశీలించారు. అక్కడినుంచి సమావేశ మందిరానికి చేరుకుని అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తిరుగు ప్రయాణంలో మంత్రులు సమ్మక్క సాగర్ బ్యారేజీకి చేరుకుని బ్యారేజీని పరిశీలించి మధ్యాహ్నం 2.05 గంటలకు హెలికాప్టర్‌లో యాదాద్రి భువనగిరికి బయలుదేరారు. అంతకుముందు సమీక్షలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, ప్రకాశ్‌రెడ్డి, మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, యశస్విని రెడ్డి, మురళినాయక్‌లు తమ తమ నియోజకవర్గాల్లో ప్రాజెక్టుల నిర్మాణం, పెండింగ్, కాలువల పూడికతీత తదితర సాగునీటి సమస్యలను మంత్రులకు వివరించారు. సమావేశంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ములుగు కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ శబరీష్, ఐటీడీఏ పీఓ చిత్రమిశ్రా, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 5.57లక్షల ఎకరాలకు నీరు

దేవాదుల జె. చొక్కారావు ఎత్తిపోతల పథకంనుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 5.57లక్షల ఎకరాలకు సాగునీరందిస్తాం. ములుగు జిల్లా ప్రాంత ప్రజల చిరకాల కోరికను కాంగ్రెస్ ప్రభుత్వం తీరుస్తుంది. మంత్రి సీతక్క కోరిక మేరకు కన్నాయిగూడెం, ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి మండలాల్లో చెరువులను గొలుసుకట్టుగా మార్చి దేవాదుల పంపింగ్ ద్వారా నీటిని అందించాలని కోరారు. మంత్రి కోరిక మేరకు ఈ మండలాలకు నీరు వచ్చే విధంగా కృషి చేస్తా.

– ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి

రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

2008లో దేవాదుల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. సుమారు 15ఏళ్లు పనులు నత్తనడకన సాగాయి. ఇంకా 3వేల ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉంది. రైతును రాజును చేయడమే ఉద్దేశంతో ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఛత్తీస్‌గఢ్‌తో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు అధికారులను ఆ రాష్ట్రానికి పంపిస్తాం.

– పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి

భూమి కోల్పోయిన రైతులకు పరిహారం

దేవాదుల బ్యారేజ్ నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతులకు మానవీయ కోణంలో తగినంత నష్టపరిహారం అందించాలి. మంగపేట, కన్నాయిగూడెం, ఏటునాగారంలలో కాల్వలపై ఏర్పాటు చేసిన లిఫ్టులు సరిగా పనిచేయక తాగునీరు అందడం లేదు. రామప్ప నుంచి పాకాలకు వెళ్లే ప్రాంతంలో 6వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కాల్వలు నిర్మించాలి.

– ధనసరి సీతక్క, మంత్రి

ప్రదోష వేళ నందీశ్వర అభిషేకం

- ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో నూతనంగా ప్రారంభం



ఐనవోలు: హనుమకొండ జిల్లాలోని ప్రఖ్యాత ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని అర్చకులు, అధికారులు నూతన పూజా కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్రంలోని అతికొద్ది శైవ క్షేత్రాల్లో మాత్రమే ఆచరించే ప్రదోష వేళ నందీశ్వర అభిషేకం కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతీనెల బహుళ పక్ష త్రయోదశి నాడు మాత్రమే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్చకులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతీనెల బహుళ పక్షం త్రయోదశి రోజు జరిగే కార్యక్రమాలు స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, కల్యాణం యథావిధిగా జరుగుతాయి. సాయంత్రం జరిగే కార్యక్రమాలు మాత్రం నూతనంగా ప్రారంభిస్తున్నారు. ప్రదోష కాలంలో స్వామివారి గర్భాలయానికి ఎదురుగా ఉన్న నందీశ్వరుడికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి వస్త్రధారణ చేస్తారు. అనంతరం ఏకకాలంలో నందీశ్వరుడికి, రుద్రుడికి హారతి సమర్పణ కార్యక్రమం జరుగుతుంది. ఇలాంటి అద్భుతమైన కార్యక్రమం రాష్ట్రంలోని అతి కొద్ది ఆలయాల్లో మాత్రమే జరుగుతుండగా.. 1,100 ఏళ్ల చరిత్ర కలిగిన మల్లికార్జునస్వామి ఆలయంలో మొట్టమొదటిసారి నిర్వహిస్తున్నట్లు అర్చకులు చెప్పారు. కార్యక్రమంలో పాల్గొనాలనుకునే భక్తులు ఈఓ కార్యాలయంలో సంప్రదించి తమ పేర్లు, గోత్ర నామాలు నమోదు చేసుకుని రూ.1,116లు చెల్లించి రశీదు పొందాలని సూచించారు.